www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 23 ఫిబ్రవరి 2025
5
పశ్చిమ గోదావరి



8న జాతీయ లోక్ అదాలత్

11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మార్చి 8న జరుగనున్న జాతీయను జయప్రదం చేయాలని తాడేపల్లిగూడెం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా పిలుపునిచ్చారు. శనివారం న్యాయవాదులతో జరిగిన సమావేశంలో ఎక్కువ కేసులను రాజీ చేయాలని సహకరించాలని కోరారు. అలాగే రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులతో రాజీ ప్రయత్నం చేయాలని పోలీసు అధికారులకు తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యశిరణ్‌శ్రీ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దూలం విజయకుమార్, సీనియర్ న్యాయవాదులు తాడేపల్లిగూడెం, చేబ్రోలు, గణపవరం, నిడమర్రు, తాడేపల్లిగూడెం రూరల్, పెంటపాడుకు చెందిన పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులపై వేటు..!

ఏలూరు జిల్లాలో 10,816 కార్డులు తొలగింపు

'పశ్చిమ'లో 9,581 కార్డులకు మంగళం

రెండు జిల్లాల్లో 20,397 రేషన్‌కార్డులు ఇక లేనట్టే

అత్యంత రహస్యంగా ప్రభుత్వ ఆపరేషన్

లబ్ధిదారులకు కార్డుల తొలగింపుపై స్పష్టత కరవు

వచ్చే నెలలో రేషన్ తీసుకునేటప్పుడు బయటపడే అవకాశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రేషన్‌కార్డుల తొలగింపుపై ప్రభుత్వ అత్యంత రహస్య ఆపరేషన్ కొనసాగించినట్లు తెలుస్తోంది. రెండు జిల్లాల్లో 20,397 రేషన్‌కార్డులు తొలగించినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. రేషన్‌కార్డుల తొలగింపు సమాచారం కార్డుదారులకైనా తెలుసా అనే అనుమానాలు నెలకొన్నాయి. వచ్చే నెల రేషన్ తీసుకునేటప్పుడు తెలిసే అవకాశం కన్పిస్తోంది. ప్రభుత్వం ఏ సర్వే ప్రకారం రేషన్ కార్డుల తొలగింపు ప్రక్రియ చేపట్టిందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. చనిపోయిన వారి కార్డులు తొలగించినట్లు పైకి చెబుతున్నా అందులో వాస్తవికతపై అనుమానాలు నెలకొన్నాయి. ఏలూరు జిల్లాలోని 27 మండలాల పరిధిలో 1,123 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో డిసెంబర్‌లో ప్రభుత్వ డేటా ప్రకారం 6,31,044 తెల్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. ప్రతినెలా ఈ కార్డుదారులు రేషన్ సరుకులు అందుకుంటున్నారు. ఫిబ్రవరి నెల ప్రభుత్వ డేటాలో ఏలూరు జిల్లాలోని రేషన్‌కార్డుల సంఖ్య 6,20,228కు తగ్గిపోయాయి. అంటే గడిచిన డిసెంబర్ నుంచి ఫిబ్రవరి మధ్యలో ఏలూరు జిల్లావ్యాప్తంగా 10,816 రేషన్‌కార్డులు తొలగింపునకు గురైనట్లు లెక్కలు చెబుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలోని 20 మండలాల పరిధిలో మొత్తం 1,052 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో డిసెంబర్ నెల డేటా ప్రకారం 5,67,651 తెల్లరేషన్‌కార్డులు ఉన్నాయి. ఫిబ్రవరిలో తాజాగా విడుదల చేసిన డేటా ప్రకారం కార్డుల సంఖ్య 5,58,070 మాత్రమే ఉన్నాయి. రెండు నెలల వ్యవధిలో 9,581 రేషన్‌కార్డులు మాయమయ్యాయి. రేషన్‌కార్డుల తొలగింపు ప్రక్రియ ఏవిధంగా జరిపారో.. ఎవ్వరికీ అర్థం కావడం లేదు. అనర్హుల జాబితాను



ఏవిధంగా తేల్చారో అర్థం కావడం లేదు. చనిపోయిన వారి కార్డులను తొలగించాలన్నా క్షేత్రస్థాయిలో సర్వే చేయాల్సి ఉంటుంది. ప్రతినెలా రేషన్ సరుకులు తీసుకోవాలంటే ఈపోస్ యంత్రంలో వేలిముద్ర వేయాలి. వేలిముద్ర వేయకపోతే సరుకులు తీసుకోవడం సాధ్యం కాదు. సరుకులు తీసుకోకపోతే రేషన్‌కార్డు పని చేయదు. ప్రత్యేకంగా తొలగించడం ఏమిటో తెలియని పరిస్థితి నెలకొంది.

కొత్త కార్డులు లేవు.. ఉన్న కార్డులు పోయే..!

కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు గడిచినా ఇప్పటికీ కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఇప్పుడు ఉన్న రేషన్‌కార్డులను తీసేస్తున్న పరిస్థితి నెలకొంది. రేషన్‌కార్డుల తొలగింపుపై పలు అనుమానాలు నెలకొన్నాయి. వచ్చే నెల రేషన్ తీసుకునేటప్పుడు అసలు విషయం బయటికి వచ్చే అవకాశాలు ఉన్నాయి. రేషన్ కార్డుల తొలగింపు ప్రక్రియ అంతా ప్రభుత్వం వ్యూహాత్మకంగానే చేసినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం వచ్చాక హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ సర్వే మాత్రమే జరిగినట్లు చెబుతున్నారు. రేషన్ కార్డులకు సంబంధించి ఎటువంటి సర్వే జరగలేదని అధికారుల మాటలు చెబుతున్నాయి. జిల్లాలో పి-4 సర్వే కూడా జరగలేదు. అటువంటప్పుడు దేని ఆధారంగా రేషన్‌కార్డుల సంఖ్య తగ్గిపోయిందో ప్రభుత్వమే చెప్పాల్సి ఉంది. ఎంతోమంది వివాహమైన జంటలకు రేషన్‌కార్డులు లేక ప్రభుత్వ పథకాలు అందని పరిస్థితి నెలకొంది. కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ చేపట్టకుండా ఉన్న కార్డులను తొలగించే చర్యలకు దిగడంపై అందరినీ నివ్వెరపోయేలా చేస్తోంది.

భూ రికార్డుల ఆధునికీకరణకే రీ సర్వే

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

రైతుల భూములకు హద్దులను గుర్తించి రికార్డులు ఆధునికీకరించేందుకే రీసర్వే నిర్వహిస్తామని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. రీసర్వే పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన తుందుర్రులో జరుగుతున్న రీసర్వే గ్రౌండ్ ట్రూతింగ్ పనులను, సరిహద్దుల మ్యాపులను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ రైతుల భూములకు కచ్చితమైన హద్దులు గుర్తించి ప్రయోగాత్మకంగా రీసర్వే నిర్వహిస్తున్నారన్నారు. సర్వే నిర్వహించే ముందు భూయజమానులకు తెలియజేయాలని, వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతులు అభ్యంతరాలేమైనా తెలియజేస్తే నమోదు చేసుకోవాలన్నారు. దస్త్రావేజుల్లో తప్పులుంటే సరిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహశీల్దార్ రావి రాంబాబు, డిప్యూటీ తహశీల్దార్ ఇ.నాగార్జున, ఎంపిడిఒ ఎన్.మురళీగంగాధర్, ఇరిగేషన్ ఎఇ ఎన్.వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచి ఆరేటి వీరాస్వామినాయుడు, ఎంపిపి వాసు, గ్రామ కార్యదర్శి భవాని, విఆర్ఒ, ఎఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మ్యాప్ పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి



డ్రోన్ల పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

డ్రోన్ల వినియోగం లాభదాయకం

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వరి సాగులో డ్రోన్ల వినియోగం లాభదాయకమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం తుందుర్రు గ్రామంలో వరి పంటకు సోకిన అగ్గి తెగులు నివారణకు ట్రైసోక్లోజోల్ 75 శాతం డ్రోన్ ద్వారా వెదజల్లే కార్యక్రమాన్ని కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వయంగా పరిశీలించారు. డ్రోన్ ఆపరేటర్ మల్లుల శ్రీనివాసరావుతో మాట్లాడుతూ ఎంత వరకూ చదువుకున్నారు, డ్రోన్ వినియోగంలో సహాయకులు ఎంతమంది ఉంటారు, ఎకరానికి ఎంత సమయం పడుతుంది, డ్రోన్ ఖరీదు ఎంత, రోజుకు ఎన్ని ఎకరాలు స్ప్రే చేయవచ్చు తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీర్ చదువుకున్నానని, వ్యవసాయం మీద మక్కువతో వరి సాగుతో పాటు, డ్రోన్ ఆపరేటింగ్ కూడా చేస్తున్నానని శ్రీనివాస్ తెలిపాడు. 2021లో విజయవాడ నుండి ఒక డ్రోన్ కొనుగోలు చేయడం చేయడం జరిగిందని, కొంతకాలం వినియోగం తర్వాత దాన్ని అమ్మి, 2023 లో సుమారు రూ.నాలుగు లక్షలతో ఒక డ్రోన్‌ను స్వయంగా తయారు చేసి వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఎకరాకు మందును స్ప్రే చేసేందుకు రూ.400 ఛార్జి చేస్తామని, సంవత్సరంలో సుమారు మూడు వేల ఎకరాలు భీమవరం, ఉండి, పెద్దపుల్లేరు ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా క్రిమిసంహారక మందులను వెదజల్లడం జరుగుతుందని తెలిపాడు. ఒక రోజుకు 40 ఎకరాల్లో మందును స్ప్రే చేయొచ్చని తెలిపాడు. డ్రోన్ ద్వారా స్ప్రే చేయడం వల్ల నీటి వినియోగం తక్కువగా ఉంటుందని, అలాగే వరి క్షేత్రం మొత్తం సమానంగా మందు వెదజల్లడంతో మందు వృథా కాకుండా, సమయం కూడా చాలా తక్కువ పడుతుందని కలెక్టర్ వివరించాడు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ చదివి వరి సాగు, డ్రోన్ ఆపరేటింగ్ చేయడం చాలా గొప్ప విషయం అన్నారు. చాలామందికి మీరు స్ఫూర్తిగా నిలుస్తారన్నారు. మరింత మందికి మీ ద్వారా డ్రోన్ల గురించి శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ కోరారు. తుందుర్రులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వయంగా పరిశీలించారు. జిల్లా కలెక్టర్ సమక్షంలో వ్యవసాయ విస్తరణ అధికారి బి.దేవి స్వరూప రైతులను వివరాలు అడిగి చేస్తున్న రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1.15 లక్షల మంది రైతులకు రైతు రిజిస్టరీ పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటివరకు సుమారు 75 వేల మంది రైతుల వివరాలను నమోదు చేసి గుర్తింపు సంఖ్యను అందజేయడం జరిగిందన్నారు. 1.15 లక్షల మంది రైతుల్లో 90 వేల మంది పిఎం కిసాన్ లబ్ధిదారులు ఉన్నట్లు తెలిపారు. భూమి కలిగిన రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసి ప్రతి రైతుకూ 11 అంకెలతో కూడిన విశిష్ట సంఖ్యను మంజూరు చేయటం జరుగుతుందన్నారు. అనంతరం ఇ-పంట నమోదు చేసిన వాటిలో కొన్ని సర్వే నెంబర్లను క్షేత్రస్థాయిలో కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డిఆర్‌సి ఇఒ జి.బాలనాగేశ్వరి, వ్యవసాయ అధికారి ఎన్.శ్రీనివాస్, తహశీల్దార్ రావి రాంబాబు, ఎంపిడిఒ ఎం.మురళి గంగాధర్, అధికారులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి

దిడ్ల వీరరాఘవులుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేయండి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - భీమవరం

పిడిఎఫ్ ప్రాతినిథ్యం వహిస్తున్న స్థానాల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని, గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి మండలికి పంపించాలని ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి కోరారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, ప్రజాసంఘాలు బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు గ్రాడ్యుయేట్ ఓటర్లు అండగా నిలిచి గెలిపించాలని కోరారు. పట్టణంలో వివిధ విద్య, ప్రభుత్వ సంస్థల్లో గోపీమూర్తి శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు స్మారక బాలికోన్నత పాఠశాల, అల్లూరి రామకృష్ణంరాజు హైస్కూల్, పస్తుల సాగరం స్మారక ఉన్నత పాఠశాల, డాక్టర్ చీడే సత్యనారాయణ కాలేజీ, కలెక్టరేట్‌లోని వివిధ శాఖల కార్యాలయాలకు వెళ్లి పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఉపాధ్యాయుల, అధ్యాపకుల, ఉద్యోగుల, కార్మికుల నిరుద్యోగుల, పేదల సమస్యల పరిష్కారం కోసం, వారి హక్కుల కోసం, హక్కుల రక్షణ కోసం నిరంతరం పోరాడుతున్నారన్నారు. దిడ్ల వీర రాఘవులుకు విజయం చేకూర్చి మనం ప్రాతినిధ్యం వహిస్తున్న మన స్థానాన్ని తిరిగి మనం కైవసం చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకూ ఆర్థిక బకాయిలు చెల్లించకపోవడం, ఐఆర్, పిఆర్‌సి ఇవ్వకపోవడం, సరెండర్ లీవ్‌ల ఎన్‌క్యాష్‌మెంట్ చేయకపోవడం బట్టి అధికార పార్టీ తీరును అర్థం చేసుకోవచ్చున్నారు. ఇవి సాధారణ, రాజకీయ ఎన్నికలు కాదని మన ఎన్నికలని అన్నారు. ప్రచారంలో ఆయన వెంట యుటిఎఫ్ జిల్లా నాయకులు విజయరామరాజు, అబ్రహం, నాగబాబు, రామకృష్ణంరాజు, మల్లేశ్వరరావు, సిఐటియు నాయకులు బి.వాసుదేవరావు, క్రాంతి, రాము, ప్రసాద్, కోదండం తదితరులు ఉన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి



శృంగవృక్షంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న దృశ్యం

పాలకోడేరు: పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో సమస్యలు పరిష్కరించే వారికే పట్టం కట్టాలని, ఆ విధంగా గ్రాడ్యుయేట్ ఓటర్లు ఆలోచించి ఓటు వేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ కోరారు. శృంగవృక్షంలో పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును గెలిపించాలని కోరుతూ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యావంతులు మొదటి ప్రాధాన్యత ఓటును రాఘవులుకు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషపు ఆశ్రియ్య, రామయ్య, పాండురంగారావు, ఉదయ, కొటికలపాడు శ్రీను పాల్గొన్నారు.

న్యాయమూర్తుల వ్యాఖ్యలు సరికాదు : వ్యకాస

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సబ్సిడీలు, సంక్షేమ పథకాల వల్ల వ్యవసాయ కార్మికులు సోమరిపోతుల్లాగా మారుతున్నారని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని, ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ తెలిపారు. శనివారం నవాబుపాలెం గ్రామంలో ఉపాధి పని ప్రదేశంలో ఆయన పర్యటించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టించి పని చేసే వ్యవసాయ కూలీల పట్ల న్యాయమూర్తులే అలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కూలీల మనోభావాలు దెబ్బ తినకుండా వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. ఇప్పటికే ఉన్న పలు నిబంధనలు ఉపాధి కూలీలకు కష్టంగా మారాయన్నారు. వ్యవసాయంలో కలుపు మందులు, ఇతరేతర పద్ధతుల కారణంగా వ్యవసాయ రంగంలో కూలీలకు పనిలేదని, ఉన్న పని కాస్త ఉపాధి పనేనని, కరోనా కాలంలో ఉపాధి పని లేకపోతే కూలీలకు దిక్కేలేదని అటువంటి ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగారుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం బడ్జెట్ పెంచకపోగా కేవలం 86 వేల కోట్లకే కుదించడం దారుణమన్నారు. తక్షణం బడ్జెట్లో సవరణ చేసి ఉపాధి హామీకి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ మార్చి 12వ తేదీన విజయవాడలో జరుగుతున్న రాష్ట్రస్థాయి మహా ధర్నాకు కూలీలంతా పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కండెల్లి రమేష్ బాబు, మద్దుకూరి కృష్ణ, ఘంటసాల బాబుజీ, కండెల్లి విజయ, పెనుమాక సుజాత, దున్న సునీత, కునపు సుబ్బారావు, కూనపు చిలకమ్మా, బండి అంజయ్య, రుద్ర, పండు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న జక్కంశెట్టి సత్యనారాయణ

చోరీ కేసులో 24 గంటల్లో ముద్దాయి అరెస్టు

రూ.25 లక్షలు విలువైన అభరణాలు స్వాధీనం

జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం ఆస్మీ

ప్రజాశక్తి - ఆచంట

చోరీ కేసులో ముద్దాయిని 24 గంటల్లో పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం ఆస్మీ స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పెనుగొండలో ఎంపిడిఒ కార్యాలయం వెనుక చిట్టూరివారి వీధికి చెందిన గుబ్బల లక్ష్మీనారాయణకు చెందిన రూ.25 లక్షలు విలువజేసే 49 కాసుల బంగార ఆభరణాలు ఈ నెల 20వ తేదీ రాత్రి అపహరణకు గురయ్యాయి. బాధితుని ఫిర్యాదు మేరకు నరసాపురం డిఎస్‌పి శ్రీవేద నేతృత్వంలో పెనుగొండ సిఐ రాయుడు విజయకుమార్ పర్యవేక్షణలో పెనుగొండ, పెనుమంట్ర, ఆచంట ఎస్‌ఐలు కె.గంగాధర్‌రావు, కె.స్వామి, కె.వెంకటరమణ దర్యాప్తు చేపట్టారు. పెనుగొండ శివారు చిన్నంవారిపాలెం సిద్ధాంతం రోడ్ లో ఉన్న శ్మశానవాటిక వద్ద శుక్రవారం మధ్యాహ్నం ముద్దాయి కోసూరి పోతురాజును అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించారు. ఈ చోరీలో పోతురాజుతోపాటు మరో బాలుడు (17) పాల్గొన్నట్లు గుర్తించారు. బాలుడు పరారీలో ఉండగా పోతురాజు నుంచి చోరీ చేసిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నేరస్తుడిని 24 గంటల్లో అరెస్టు చేసి చోరీ సొత్తును రికవరీ చేసినందుకు పెనుగొండ సిఐ, ఎస్‌ఐలతోపాటు కానిస్టేబుల్స్ వెంకట్రావు, గంగాధర్‌రావు, మణికంఠ సుబ్రహ్మణ్యం, రాజేష్‌లను ఎస్‌పి అభినందించి రివార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో దొంగతనాల నియంత్రణకు పోలీస్ శాఖ కృషి చేస్తుందని, దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. గతేడాతో పోలిస్తే జిల్లాలో దొంగతనాలను కొంతవరకు నివారించగలిగామన్నారు. ఇళ్లకు తాళాలు వేసి వేరే ఊర్లకు వెళ్లినప్పుడు సంబంధిత పోలీస్ స్టేషన్లో సమాచారం ఇస్తే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర నిఘాతో భద్రత కల్పిస్తామని తెలిపారు. జిల్లాలో ఎంఎల్‌సి ఎన్నికలతోపాటు శివరాత్రి ఉత్సవాల్లో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు చూపుతున్న ఎస్‌పి


మరో కేసులో 10 మోటార్ సైకిళ్లు స్వాధీనం

పెనుమంట్ర, పోడూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవల చోరీకి గురైన పది మోటర్ సైకిళ్లను పోలీసులు రికవరీ చేశారు. ఇటీవల నరసాపురం సబ్‌జైలు నుండి విడుదలైన వీరవాసరం మండలం మత్స్యపురి పెదపేటకు చెందిన కారేపల్లి ఏసురత్నం అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. మోటారు సైకిళ్ల దొంగతనం చేసినట్లు విచారణలో తేలింది. అతని వద్ద నుంచి 10 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని నిందితుని అరెస్టు చేశారు. గతంలో ఇతనిపై అనేక కేసులు కూడా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసును పాలకొల్లు రూరల్ సిఐ బి.సురేంద్ర కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

అధికార దర్పం.. హామీల పర్వం..!

పెద్దల సభలో విద్యావంతుల స్థానానికి పోరు హోరాహోరీగా సాగుతోంది. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానానికి ఈ నెల 27న పోలింగ్ జరగనుంది. ఎన్నికల బరిలో 35 మంది అభ్యర్థులు ఉండగా పిడిఎఫ్, టిడిపి అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ ఉన్నట్లు రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. అదే సమయంలో ప్రచారం తారాస్థాయికి చేరుకుంది. పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు ప్రధాన పట్టణాల్లో వివిధ సంఘాల నేతలతోపాటు విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో గ్రాడ్యుయేట్ ఓటర్లను కలుస్తూ తనకు ఓటేసి గెలిపించాలని కోరుతున్నారు. ప్రధానంగా ఇప్పటి వరకూ వివిధ ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై ఉపాధ్యాయ నేతగా చేసిన పోరాటాలు, పిడిఎఫ్ ఎంఎల్‌సిలు గత 17 ఏళ్లలో శాసనమండలిలో వినిపించిన ప్రజావాణి, మండలి వెలుపల ప్రజా ఉద్యమాలకు బాసటగా నిలిచిన తీరును వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. అదే సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఎనిమిది నెలలైనా తొలి సంతకం చేసిన డిఎస్‌సి నోటిఫికేషన్ దశకు ఇంకా చేరకపోవడం, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలేవీ అమలు కాకపోవడం, నిరుద్యోగ భృతిపై నోరెత్తకపోవడం వంటి అంశాలను ప్రస్తావిస్తూ విద్యావంతులు ఒకసారి ఆలోచించి పెద్దల సభకు తనను పెద్దరికంగా పంపాలని వీరరాఘవులు అభ్యర్థిస్తున్నారు. ఆయన తరపున పలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతోపాటు యువజన, విద్యార్థి, కార్మిక, ప్రజాసంఘాల నేతలు గ్రాడ్యుయేట్ ఓటర్లను నేరుగా కలుస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. పిలిస్తే పలికే వ్యక్తి పిడిఎఫ్ ఎంఎల్‌సిలు అనేది మరోసారి గుర్తు చేస్తున్నారు. ఈ ప్రచారం గ్రాడ్యుయేట్ ఓటర్లను ఆలోచింపజేస్తుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. నిజమేగా రోజువారీ జీవనంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలివేగా, పాలకులు వీటిని ఎందుకు పట్టించుకోవడం లేదనే చర్చ గ్రాడ్యుయేట్ ఓటర్లలో పెద్దఎత్తున



సాగుతోంది. అదే క్రమంలో ప్రశ్నించే గొంతుకను పెద్దల సభకు పంపాల్సిన ఆవశ్యకతను గుర్తించడంతోపాటు తమకు తెలిసిన పది మందికి చెబుతుండడం రాఘవులుకు కలిసొచ్చే అంశంగా చెప్పుకోవచ్చు.

అదే సమయంలో టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం తరపున మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంపీలు, అధికార పార్టీ నేతలు పెద్దపెద్ద గుంపులుగా వెళ్లి ఓటర్లను అభ్యర్థించడం సాధారణ ఎన్నికలను తలపిస్తోంది. పైగా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావాలంటే తమ అభ్యర్థికి ఓటేయాలంటూ సాగిస్తున్న ప్రచారంపై ఆయా తరగతుల ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఎనిమిది నెలల క్రితం సంపూర్ణ మెజార్టీతో గెలిపించినా సమస్యలు పరిష్కరించకపోగా ఈ దబాయింపు ప్రచారం ఏంటనే చర్చ సాగుతోంది. అదే సమయంలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఎక్కడున్నా నేరుగా కలవొచ్చని గత అనుభవాలు గుర్తు తెచ్చుకుంటున్నారు. గతంలో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సిలుగా పని చేసిన కచ్చా జార్జివిక్టర్, ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) మినహా నాడు అధికార పార్టీ అండతో గెలిచిన రవికిరణ్ ఎన్నడూ నియోజకవర్గ పరిధిలో కానరాని విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రచారపరంగా, అంశాలపరంగా, విధానాల పరంగా చూస్తే గ్రాడ్యుయేట్ ఓటర్ల మొగ్గు కచ్చితంగా పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులువైపే ఉందని చెప్పొచ్చు. అయితే అధికార పార్టీ అధికార బలంతోపాటు ప్రలోభాల పర్వానికి తెరలేపుతోంది. ఇప్పటికే దూరప్రాంతాన ఉన్న గ్రాడ్యుయేట్ ఓటర్లకు ప్రత్యేక బస్సుల ఏర్పాటుతోపాటు వచ్చి వెళ్లినందుకు భత్యం, కానుకలు, ఇతర సౌకర్యాలు సమకూరుస్తామని కబుర్లు పంపుతోంది. ఇక స్థానికంగా నగదు, తాయిలాలు పంచుతామని ఊరిస్తోంది. అయితే వీటికి విద్యావంతులైన గ్రాడ్యుయేట్ ఓటర్లు లొంగుతారా అనే అనుమానం అధికార పార్టీ నేతల్లోనూ ఉంది. ఈ నేపథ్యంలో తప్పుల తడకగా ఉన్న ఎంఎల్‌సి ఓటర్ల జాబితాను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు అధికార బలాన్ని ఉపయోగించుకునేలా వ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఉండి మండలంలో ఒకే పేరున రెండు నుంచి మూడు ఓట్లు ఉన్న నేపథ్యంలో అసలు ఓటరు ఒక ఓటు వేసినా, మిగిలినవి ఏదోక రూపంలో పోల్ చేయించి తమకు ఓటు చేయించుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై అధికార యంత్రాంగాన్ని ప్రలోభ పెట్టేందుకు ప్రత్యేక కేంద్రీకరణ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో విద్యావంతులు తమ సీటు నిలబెట్టుకుంటారా, లేక అధికార బలందే గెలుపవుతుందా అనేది వేచిచూడాల్సిందేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

-వివిఎస్‌వి.ప్రసాద్

ఎస్ఐగా మానస బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు ఎస్ఐగా ట్రెయినీ డిఎస్‌పి కె.మానస శనివారం బాధ్యతలు స్వీకరించారు. శిక్షణలో భాగంగా మానసను మొగల్తూరు ఎస్ఐగా నియమించారు. ఆమె శనివారం ప్రస్తుత ఎస్ఐ జి.వాసు నుంచి మానస బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సిఐ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు కార్యక్రమాలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం పంచాయతీ పరిధిలో శని, ఆదివారం రెండు రోజులు ప్రత్యేక పారిశుధ్య మెరుగుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచి మూర అలంకారం, కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఉదయం ఆరు గంటల నుండే పంచాయతీ పరిధిలోని 16 వార్డుల్లో స్థానికులకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించడానికి 8 వార్డులకు 8 మంది టీమ్‌లుగా పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు స్థానికులు తడి, పొడిచెత్త వేరుచేసి ఇవ్వాలని తెలిపారు. సేకరించిన చెత్తను ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ వద్దకు తరలిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : గ్రామ పంచాయతీలో ప్రత్యేకంగా పారిశుధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎం.వెంకటేష్ తెలిపారు. కడియద్ద, చినతాడేపల్లి గ్రామాల్లో శనివారం ఇంటింటికీ పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలు పరిశుభ్రంగా ఉండాలన్నా, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నా పారిశుధ్యం మెరుగుపడాలని, దీనికి ప్రజల సహకారం అవసరమని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శులు కాకరపర్తి శ్రీనివాస్, బిరుదుకోట రమేష్, ఎంఆర్‌సిఎం.రవికిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్షయపై అవగాహనా ర్యాలీ

గణపవరం:కాశిపాడులో మండల పిఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో క్షయపై శనివాం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిఎంపి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె పర మేశ్వర్లు మాట్లాడుతూ ఏటా ఫిబ్రవరి 17 నుంచి 23వ తేదీ వరకూ జరిగే టిబి వారోత్సవాల్లో భాగంగా క్షయపై అవగాహనా ర్యాలీ నిర్వ హిస్తున్నట్లు చెప్పారు. క్షయపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. రెండు వారాలపాటు దగ్గు, సాయంత్రం జ్వరం రావడం, ఆకలి, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే క్షయ రోగ లక్షణాలుగా గుర్తించొచ్చని చెప్పారు. అనంతరం హెల్త్ సబ్ సెంటర్ వద్ద ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం నిర్వహించారు. ర్యాలీలో పంచాయతీ కార్యదర్శి జి.జాషువా, సబ్ సెంటర్ సిహెచ్ ఒ.వి.రమ్య, ఎఎన్ఎం.శివకుమారి, పిఎంపి సభ్యులు ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు లక్ష్యం ఉండాలి

ప్రజాశక్తి - కాళ్ల

పదో తరగతి విద్యార్థులకు లక్ష్యం ఉండాలని రిటైర్డ్ ప్రొఫెసర్ కెవి.సుబ్బారాజు తెలిపారు. సీసలిలో తోట వెంకయ్య సత్యవతమ్మ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు శ్రీజయలక్ష్మి శివ ఆధ్వర్యంలో ప్రేరణ సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారాజు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం కోసం కష్టపడి చదవాలని, ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన తర్వాత ఏ రంగంలోకి వెళ్లాలన్న స్పష్టత విద్యార్థులకు ఉండాలని చెప్పారు. ఏ కోర్సు చదవాలో నిర్ణయించుకుని ఆ అంశానికి సంబంధించిన జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. అనంతరం 70 మంది విద్యార్థులకు ప్యాడ్స్, జామెట్రీ బాక్స్‌లు శ్రీజయలక్ష్మి సీ ఫుడ్ ఎమ్‌డి మహినాథ్ చేతుల మీదుగా అందజేశారు. జనసేన సిసలి గ్రామ అధ్యక్షులు నూకల భోగేంద్రబాబు ఆర్థిక సహకారంతో 70 మంది పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ టెస్ట్ పేపర్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని జివి.పద్మావతి, మాజీ సర్పంచి కట్రెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఉప సర్పంచి కట్రెడ్డి వెంకట చల్లారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

3 నుంచి రూబెల్ల వ్యాక్సిన్‌పై ప్రత్యేక కార్యక్రమం

గణపవరం:మార్చి 3 నుంచి ఎనిమిదో తేదీ వరకూ గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మీజిల్స్ రూబెల్ల వ్యాక్సిన్‌పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు డాక్టర్లు పి.సంతోష్, పి.కిరణ్మయి అన్నారు. శనివారం స్థానిక పిహెచ్‌సిలో ఆరోగ్య సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రూబెల్ల వ్యాక్సిన్ వేసే వారి లిస్టులు సచివాలయం వారిగా ఇవ్వాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. కిరణ్మయి మాట్లాడుతూ తమ ఆరోగ్య కేంద్రంలో నెలకు కనీసం ఐదు సాధారణ ప్రసవాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలు వెంటనే ఇవ్వండి

ప్రజాశక్తి - పెనుమంట్ర

రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బకాయిలు వెంటనే ఇవ్వాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతి రాజు రవీంద్రరాజు, కార్యదర్శి అప్పలనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చిరకాలంగా పేరుకుపోయిన సమస్యలను తీర్చాలన్నారు. ఉద్యోగులకు పాత బకాయిలైన డిఎ, ఐఆర్, పిఆర్‌సి కమిటీపై సోమవారం నుండి జరగబోయే బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలని కోరారు.

నరేంద్రకు డాక్టరేట్

పెనుమంట్ర:విద్య, సామాజిక సేవా రంగాల్లో చేస్తున్న సేవలకు గుర్తింపుగా మండలంలోని ఎస్‌విజి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు సిహెచ్ వెంకట నరేంద్రకు డాక్టరేట్ లభించింది. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో జరిగిన అవార్డు కార్యక్రమంలో విశిష్ట అతిథుల చేతులమీదుగా డాక్టరేట్ అందుకున్నారు. నరేంద్రను ఎంఇఒలు అభినందించారు.

మాంటిస్సోరిలో కవలల దినోత్సవం

ప్రజాశక్తి - తణుకు

మాంటిస్సోరి స్కూల్లో కవలల (ట్విన్స్ డే) దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు మాట్లాడుతూ ఏటా ఫిబ్రవరి 22వ తేదీన కవలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాంటిస్సోరి స్కూల్ హెడ్‌మిస్ట్రస్ ఎం.లక్ష్మి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.జ్ఞానమంజరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'వంచనకు మారుపేరు కూటమి ప్రభుత్వం'

ప్రజాశక్తి - తణుకు రూరల్

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తూ వంచనకు మారుపేరుగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని మాజీ ఎంపీ జివి.హర్షకుమార్ విమర్శించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో పోటీ చేస్తున్న తన కుమారుడు జివి సుందర్‌ను గెలిపించాలని కోరుతూ శనివారం తణుకులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా తణుకు మండలం తేతలి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన కుమారుడు సుందర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తేతలి గ్రామ మాజీ సర్పంచి కోట నాగేశ్వరరావు, మాజీ ఎంపిటిసి సరెళ్ల వీరతాత పాల్గొన్నారు.

'రాజశేఖరంను గెలిపించాలి'

గణపవరం:ఈ నెల 27వ తేదీన జరిగే ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. శనివారం పిప్పరలోని పలు విద్యాసంస్థల్లో అధ్యాపకులను కలిసి రాజశేఖరంను గెలిపించాలని కోరారు ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, జిల్లా ఛైర్ పర్సన్ గంటా పద్మశ్రీ, ఎన్నికల పరిశీలకులు వివిఎస్.సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు

ఉండి : కూటమి ఎంఎల్‌సి అభ్యర్థి రాజశేఖరంను గెలిపించాలని ఉండి మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు మంతెన కృష్ణకుమారి, మండల సమాఖ్య అధ్యక్షులు కర్రి జయలక్ష్మి అన్నారు. శనివారం ఉండిలోని పలు ప్రయివేటు విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులను కూటమి అభ్యర్థికి ఓటు వేయాల్సిందిగా ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో డిసి ఉపాధ్యక్షులు మంతెన సాయి లచ్చిరాజు, యూనిట్ ఇన్‌ఛార్జి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - మొగల్తూరు

రహదారి ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటనపై శనివారం కేసు నమోదు చేశామని ఎస్ఐ జి.వాసు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాళీపట్నం తూర్పునకు చెందిన రంగిశెట్టి రామారావు ఈ నెల 12న రాత్రి సమయంలో 216 జాతీయ రహదారి పైకి వచ్చారు. ఆ సమయంలో రామారావును ద్విచక్ర వాహనం ఢీకొంది. కుటుంబ సభ్యులు విజయవాడలోని ప్రయివేట్ ఆస్పత్రిలోకి చేర్పించారు. అక్కడి నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మొగల్తూరు - కొత్తపల్లి రహదారికి మోక్షం..!

ప్రయాణికులు, స్థానికులు హర్షం


ప్రారంభించిన రోడ్డు పనులు

ప్రజాశక్తి - మొగల్తూరు

ఎట్టకేలకు మొగల్తూరు నుంచి జిల్లా కేంద్రం భీమవరం వెళ్లే ప్రధాన రహదారికి మోక్షం లభించింది. సుమారు పదేళ్లుగా ఈ రహదారి దెబ్బతిని ఈ మార్గంలో రాకపోకలు సాగించే జనం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక దశలో ఈ రోడ్డుపై ప్రయాణించలేక ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవాల్సి వచ్చిందంటే అతిశయోక్తి కాదు. నాటి టిడిపి ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనా పనులు ఇంకా ప్రారంభ దశలోనే ఉండటం గమనార్హం. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఈ రోడ్డు పనులు వేగవంతం చేయించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని అంతా కోరుతున్నారు. ఈ రహదారి గుండా ప్రయాణించాలంటే ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. మొగల్తూరు నుంచి పడమటిపాలెం, కొత్తపాలెం మీదుగా భీమవరం గ్రామీణ మండలం వెంప వెళ్లే ఆర్అండ్‌బి రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ఈ రహదారి నిర్మాణానికి గత టిడిపి ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు రూ.12 కోట్లు నిధులు మంజూరు చేశారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వంలో పనులు ప్రారంభించారు. గుత్తేదారుకు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో రోడ్డు నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. కరోనాతో గుత్తేదారు సంస్థ యజమాని మృతి చెందాడు. దీంతో పనులు నిలిచిపోయాయి. మొగల్తూరు నుంచి కొత్తపాలెం వరకూ సుమారు ఆరు కిలో మీటర్లు, భీమవరం గ్రామీణ మండలం పెదగరువు నుంచి భీమవరం, నరసాపురం రహదారి వరకూ సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రెండు వరుసలుగా రహదారిని అభివృద్ధి చేయాల్సి ఉంది. దానికి అనుగుణంగా ఆ రహదారి నిర్మాణ పనులు చేపట్టినా మధ్యలోనే నిలిచిపోయాయి. మూడేళ్లుగా వాహనాల రద్దీతో రహదారి మరింత ధ్వంసమైంది. రహదారిపై పెద్ద పెద్ద గంతలు ఏర్పడ్డాయి. వర్షం కురిస్తే ఆ గుంతల్లో నీరు నిలిచి మడుగులను తలపిస్తున్నాయి.

మొగల్తూరు, పరిసర గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రం భీమవరానికి, అక్కడ నుంచి మండలంలోని గ్రామాలకు ఈ రహదారిపైనే నిత్యం వేలాది మంది ప్రయాణిస్తుంటారు. ఈ గుంతల కారణంగా నిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రహదారి నిర్మాణ పనులు దక్కించుకున్న గుత్తేదారు కరోనాతో మృతి చెందడంతో ఆ సంస్థ చేసిన పనులకు బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగింది. దీంతో ఆ సంస్థ వారసులు పనులు చేసేందుకు వెనుకడుగు వేశారు.

మొగల్తూరులో 5కె వాక్

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులో ఈ నెల 23వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 5కె వాక్ నిర్వహించనున్నట్లు ఊపిరితిత్తులు, చాతి వైద్య నిపుణులు సంక వెంకట సుబ్రహ్మణ్య పాపారావు శనివారం_ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు 5కె వాక్‌ను ఏర్పాటు చేశామని కోరారు.

లోసరి కాలువను ప్రక్షాళన చేయండి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

డిఎన్ఆర్ కాలేజీ రోడ్డును ఆనుకుని ప్రవహిస్తున్న లోసరి పంట కాలువను ప్రక్షాళన చేయాలని పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి.లక్ష్మీనారాయణ సూచించారు. ప్లాస్టిక్ కవర్లు, చెత్తా చెదారాలు వేసి కాలువను అపరిశుభ్ర పరుస్తున్నందున వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై మున్సిపల్ కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఇరిగేషన్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో శనివారం 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి బి.లక్ష్మీనారాయణ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంట కాలువ నీరు కింది గ్రామాలకు తాగునీరు అయినందున, ఆ నీటిని అపరిశుభ్రం చేస్తే ప్రజలు రోగాల బారిన పడతారన్నారు. నీటిలో వ్యర్థాలు వేయకుండా ప్రజలకు అర్థమయ్యే పద్ధతుల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు స్పందిస్తూ తక్షణం అవసరమైన చర్యలు తీసుకుని నెల రోజుల్లో నివేదికను అందజేస్తామన్నారు.


మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని డిఎల్‌పిఒ జ్యోతిర్మయి సూచించారు. శనివారం మొగల్తూరు, ముత్యాలపల్లి, శేరేపాలెం తదితర గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటా చెత్త సేకరణ సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు మూడు రకాల చెత్త డబ్బాలను అందించారు. ఆమె వెంట ఇఒపిఆర్‌డి మేడిది నవీన్‌కిరణ్, కార్యదర్శులు ముచ్చర్ల నాగేశ్వరరావు, ఎం.సత్యనారాయణ ఉన్నారు.

27న క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన వ్యవసాయ డిప్లొమా చేసిన వారి కోసం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పరిశోధనా సహ సంచాలకులు టి.శ్రీనివాస్ శనివారం తెలిపారు. జిల్లాలోని గ్రామీణ ఫౌండేషన్ ఫర్ సోషల్ ఇంపాక్ట్‌కు చెందిన సంస్థ ద్వారా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, మార్టేరు ఫారం ప్రాంగణంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా ఉద్యోగాలకు వ్యవసాయ డిప్లొమా పూర్తి చేసినవారు అర్హులని, ఎంపికైన వారు ఉద్యోగ నిర్వహణలో భాగంగా క్షేత్ర స్థాయిలో రైతులకు సేవలందించాల్సి ఉంటుందని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.12,000 వేతనం ఉంటుందని, అదనంగా టిఎ 3,000 చెల్లిస్తారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 27వ తేదీన ఉదయం 10.00 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని కోరారు. ఇతర సమాచరం కోసం 8125948927, 9347527145 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ఉయ్యాలవాడ త్యాగాలు తెలుసుకోవాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

భారత స్వాతంత్ర పోరాటంలో ఉయ్యాలవాడ చేసిన పోరాటాలు, త్యాగాలు విద్యార్థులు తప్పకుండా తెలుసుకోవాలని మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. శనివారం మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పాలిటెక్నిక్ ఆఫ్ అగ్రికల్చర్‌లో ప్రథమ స్వాతంత్ర సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఎడిఆర్ టి.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మొదటగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండాలి

రోగులతో మాట్లాడే విధానం సక్రమంగా ఉండాలి

లంచం తీసుకుంటున్నట్లు ఫిర్యాదు అందితే చర్యలు తప్పవు

ఆయా శాఖల గూగుల్‌మీట్ సమీక్షలో కలెక్టర్ నాగరాణి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో మాట్లాడే విధానం సక్రమంగా ఉండాలని స్పష్టం చేశారు. రోగుల వద్ద లంచాలు తీసుకున్నట్లు ఫిర్యాదు అందితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో వైద్యఆరోగ్య శాఖ, సివిల్ సప్లయిస్, అన్న క్యాంటీన్లు, ఈ-శ్రమ పోర్టల్, గ్రామాల్లో చెత్త నుండి సంపద సృష్టించే కేంద్రాల ఏర్పాటు, ఆధార్ నమోదు కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. అన్ని రకాల మందులు ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అన్నారు. రోగుల వద్ద నుండి ఎటువంటి లంచాలు తీసుకున్నా సహించేది లేదని హెచ్చరించారు. రోగులకు అందించే వైద్య సేవల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే మన జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు బాగుందని, సర్వీసులు అందించడంలో మన జిల్లా ప్రథమ స్థానంలో ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో అన్న క్యాంటీన్ల నిర్వహణ బాగుందన్నారు. జిల్లాలో సుమారు లక్ష మంది పిల్లలకు ఆధార్ బయోమెట్రిక్ నమోదు చేయాల్సి ఉందని, ప్రత్యేక చర్యలు తీసుకుని నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అన్నారు. గ్రామాల్లో ఏప్రిల్ ఒకటి నాటికి పంచాయతీ రోడ్లమీద చెత్త కన్పించకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీపం-2 గ్యాస్ సిలిండర్ల సర్వీసు బాగుందని, అయితే గ్యాస్ సిలిండర్ సరఫరా చేసిన రెండు రోజుల్లో లబ్ధిదారునికి సబ్సిడీ సొమ్ము పడేలా చూడాలని సూచించారు. రానున్న వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీటికి ఎటువంటి ఇబ్బందులూ రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలువలు కట్టకముందే తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపుకోవాలన్నారు. ఉపాధి హామీ పనులను పెద్దఎత్తున చేపట్టాలని, చెరువులు, డ్రెయిన్ల పనులు చేపట్టి ఎక్కువ మొత్తంలో పని దినాలు కల్పించాలన్నారు. డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, డిఎంహెచ్‌ఒ బి.బాలునాయక్, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వై.దోసిరెడ్డి, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి ఎన్.సరోజ, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, జిల్లా లేబర్ ఆఫీసర్ ఎ.లక్ష్మి, జిల్లా పరిశ్రమ శాఖాధికారి యు.మంగపతిరావు పాల్గొన్నారు.

అసెంబ్లీలో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను ప్రస్తావించాలి

ప్రజాశక్తి - తణుకు

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు శాసనసభలో ప్రస్తావించి బాధితులకు న్యాయం చేకూర్చేందుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ కృషి చేయాలని అగ్రిగోల్డ్ కష్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు కోనాల భీమారావు కోరారు. శనివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎ రాధాకృష్ణకు తణుకులోని ఆయన నివాసం వద్ద వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ సమర్థ అధికారుల బృందంతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి బాధితుల సమస్యలు పరిష్కరించాలని, అగ్రిగోల్డ్ కేసులు సత్వర పరిష్కారానికి ప్రత్యేక ఫాస్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయించి, జప్తు చేసిన అస్తులన్నింటినీ కోర్టులో అబ్సెల్యూట్ చేయించాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో అగ్రిగోల్డ్ బాధితుల విషయంపై చర్చించి బడ్జెట్ కేటాయించి సత్వర న్యాయం చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కష్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి వై.నాగలక్ష్మి, తణుకు బ్రాంచి కార్యదర్శి ఎన్.రామశ్రీను, వి.మాణిక్యాంబ, విప్పర్తి గోపి, ఎన్.వెంకట్రావు, జి.దామోదరరెడ్డి, పి.వెంకటేశ్వరరావు, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

లిఫ్ట్ ఇస్తామంటూ నిలువు దోపిడీ

ఇద్దరు చోరుల అరెస్టు

ప్రజాశక్తి - తణుకు రూరల్

రాత్రి సమయంలో లిఫ్ట్ ఇస్తామని చెప్పి నమ్మించి మోటార్ సైకిల్‌పై నిర్మానుష్య ప్రదేశాలకు తీసుకెళ్లి వాళ్లను బెదిరించి బంగారం, నగదు, సెల్‌ఫోన్లు అపహరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తాడేపల్లిగూడెం డిఎస్‌పి డి.విశ్వనాథ్ తెలిపారు. శనివారం తణుకు రూరల్ పోలీస్ స్టేషన్లో నిందితుల అరెస్టు వివరాలు వెల్లడించారు. బుట్టాయగూడెం మండలం కె.రామచంద్రపురం గ్రామానికి చెందిన ఏలూరు ప్రేమ్, వీరవాసరం మండలం నవుడూరు గ్రామానికి చెందిన కాపా సుధాకర్ అలియాస్ సుజుకి ప్రస్తుతం పైడిపర్రులో నివాసం ఉంటున్నారు. వీరు ఇరువురు ఆయా కూడళ్లలో రాత్రి సమయంలో ఒంటరిగా ఉంటున్న వారిని లక్ష్యం చేసుకుని, లిఫ్ట్ ఇస్తామని నమ్మించి బైక్‌పై తీసుకెళ్లి ఆయుధాలతో బెదిరించి బంగారం, నగదు అపహరించుకుపోతున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2.87 లక్షలు విలువైన 41 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు సెల్‌ఫోన్లు, వారు వినియోగిస్తున్న బైకును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన తణుకు రూరల్ సిఐ బి.కృష్ణకుమార్, తణుకు రూరల్ ఎస్ఐ కె.చంద్రశేఖర్, ఎఎస్ఐ పి.సంగీతరావు, హెడ్ కానిస్టేబుల్ బి.శ్రీనివాస్, కానిస్టేబుళ్లు షేక్ అన్వర్, ఎం.శ్రీనివాస్, ఎం.రవీంద్ర తదితరులను ఆయన అభినందించారు.

మోటార్ సైకిల్ చోరీ

ప్రజాశక్తి - ఉండి

పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామానికి చెందిన కొలుకలూరి సతీష్ ఈ నెల 19న ఉండి మండలం కలిసిపూడి గ్రామంలోని తన మేనమామ ఎంపిటిసి దంగేటి రామలింగేశ్వరరావు ఇంటికి వచ్చారు. రాత్రి సమయంలో మోటార్ సైకిల్‌ను ఇంటి ఆవరణలో ఉంచగా తెల్లవారుజామున లేచి చూసేసరికి మోటార్ సైకిల్ చోరీకి గురైందని, కిటికీలో ఛార్జింగ్‌లో పెట్టిన తన మొబైల్ ఫోన్ కూడా చోరీకి గురైందని సతీష్ ఉండి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ మహ్మద్ నశీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆధార్ లింకు తప్పనిసరి

ప్రజాశక్తి - ఆచంట

దీపం పథకం ఉచిత గ్యాస్ కంపెనీలో భాగంగా ప్రతి ఒక్కరూ ఆధార్ బ్యాంక్ అకౌంట్ లింకు తప్పనిసరిగా చేయించుకోవాలని తహశీల్దార్ జి.కనకరాజు అన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సివిల్ సప్లయిస్ అధికారులు, రెవెన్యూ రేషన్ డీలర్లు, ఎండియు ఆపరేటర్లు, గ్యాస్ ఏజెన్సీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపం పథకంలో ఉచిత గ్యాస్ కంపెనీలో భాగంగా వినియోగదారునికి రెండు మూడు బ్యాంక్ అకౌంట్లో ఉంటే ఈ నంబర్‌కు ఆధార్ అకౌంట్ ద్వారా లింక్ అయిందో ఆ బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు జమవుతాయన్నారు. అదేవిధంగా ఎండియు వాహన డ్రైవర్లు అదనపు డబ్బులు వసూలు చేయకూడదని, గ్యాస్ డెలివరీ బాయ్స్ కూడా అదనపు ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మెరుగైన పారిశుధ్య సేవలకు కృషి

ప్రజాశక్తి - ఉండి

గ్రామంలో మెరుగైన పారిశుధ్య సేవలందించేందుకు పంచాయతీ సిబ్బంది కృషి చేస్తుందని మండల విస్తరణాధికారి చల్లా వెంకటరెడ్డి అన్నారు. శనివారం ఎన్ఆర్‌పి.అగ్రహారం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలకు తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కార్యక్రమంలో వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జడ్డు వెంకట తాత నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ హైస్కూల్లో ఆటల పోటీలు

నరసాపురం: పట్టణంలోని మిషన్ హైస్కూల్ గ్రౌండ్‌లో శనివారం నియోజకవర్గ (జోన్ స్థాయి) బాలికల ఆటల పోటీల పోటీలను ఎంఇఒ పి.పుష్పరాజ్యం ప్రారంభించారు. ఈ పోటీలకు రెండు మండలాల్లోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుండి సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారని నియోజకవర్గ కోఆర్డినేటర్ అడపా రామకృష్ణ తెలియజేశారు. కబడ్డీ, ఖోఖో, త్రోబాల్ పోటీల్లో తూర్పుతాళ్లు, యర్రంశెట్టి వారి పాలెం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ జె.ప్రసాద్, పిఇటిలు రాజశేఖర్, దుర్గా భవాని పాల్గొన్నారు.

నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పంచారామ క్షేత్రం క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 23 నుంచి ఫిబ్రవరి 27వ తేదీ వరకూ మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ ముచ్చర్ల శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 26వ తేదీ బుధవారం మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆలయంలో భారీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ స్వామివారి దర్శనాలు ఉంటాయని తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 11 వరకూ అభిషేకాలకు అనుమతి ఉందని తెలిపారు.

నరసాపురం:లక్ష్మణేశ్వరంలో దుర్గా లక్ష్మణేశ్వర స్వామి ఆలయం వద్ద ఈ నెల 26న మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ మేరకు పెయింటింగ్, టైల్స్ పనులను శనివారం జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ పర్య వేక్షించారు. ఆయన వెంట అంజిబాబు, కర్ణా కుమార్, బోనం నాగేశ్వరరావు ఉన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 26వ తేదీ బుధవారం మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాట్లను దేవాదాయ శాఖ ఉప కమిషనర్ డిఎల్‌వి.రమేష్‌బాబు శనివారం పరిశీలించారు. యాత్రికులకు ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట అధికారి ఇవి సుబ్బారావు, ఇఒ ముచ్చెర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీ సూర్యలో ఘనంగా ఫేర్‌వెల్

ప్రజాశక్తి - నరసాపురం

స్థానిక శ్రీసూర్య కళాశాలలో శనివారం ఘనంగా ఫేర్‌వెల్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జి.గంగరాజు విచ్చేశారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండంట్ ఘంటసాల బ్రహ్మాజీ బాధ్యత వహించారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ చట్టాలను గౌరవించాలని, పర్యావరణాన్ని కాపాడుకోవాలని, పుస్తక పఠనం ఉండాలని తెలిపారు. తల్లిదండ్రులను గౌరవిస్తూ సంస్కృతీ నాగరికతను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యాపరంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ముఖ్యఅతిథి బహుమతులు అందజేశారు. బ్రహ్మాజీ మాట్లాడుతూ గంగరాజును స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ ఘంటసాల సూర్యనారాయణ, అకాడమిక్ అడ్వయిజర్ బోయి రామచంద్ర రెడ్డి, సీనియర్ అధ్యాపకులు ఎఆర్ఎస్.కుమార్, కసా జానకీరామ్, ఎండీ ఫాజిల్ పాల్గొన్నారు.